## ప్రాపర్టీ షోలో డిజాస్టర్ రెస్పాన్స్ అండ్ ఫైర్ సర్వీస్ స్టాల్

జూబ్లీహిల్స్, మార్చి 7: క్రెడాయ్, హైదరాబాద్ నిర్వహించనున్న ప్రాపర్టీ షో-2024లో తెలంగాణ స్టేట్ డిజాస్టర్ రెస్పాన్స్ అండ్ ఫైర్ సర్వీస్ స్టాల్‌ను ఏర్పాటు చేయనున్నట్లు తెలంగాణ అగ్నిమాపక సేవల విభాగం ఒక ప్రకటనలో తెలిపింది. మాదాపూర్ హైటెక్స్‌లో నేటి నుంచి ఈనెల 10 వరకు మూడు రోజుల పాటు జరుగనున్న ఎగ్జిబిషన్ హాల్‌లో ఎత్తైన భవనాల వద్ద చేపట్టాల్సిన ఫైర్ సేఫ్టీ ప్రొటోకాల్, ప్రికాషన్స్‌పై ప్రజలకు, బిల్డర్లకు అవగాహన కల్పించనున్నట్లు తెలిపారు. ఇందులో భాగంగా డీజీఎఫ్ఎస్ వై.నాగిరెడ్డి నేతృత్వంలో ప్రజలకు మెరుగైన సేవలందించేందుకు కొనుగోలు చేసిన అత్యాధునిక సాంకేతిక పరికరాలను స్టాల్‌లో ప్రదర్శించనున్నట్లు తెలిపారు.

# అప్పుడు ఓట్ల కోసం.. ఇప్పుడు నోట్ల కోసం

- ఎల్ఆర్ఎస్‌పై కాంగ్రెస్ అడ్డగోలు ప్రకటనలు
- ఉచితంగా అమలు చేయాల్సిందే: ఎమ్మెల్యే గాంధీ



డీసీ రజనీకాంత్‌రెడ్డికి వినతిపత్రం ఇస్తున్న ఎమ్మెల్యే గాంధీ, స్టాండింగ్ కౌన్సిల్ సభ్యుడు శ్రీకాంత్, కార్పొరేటర్లు, పార్టీ నేతలు

మియాపూర్ , మార్చి 7: అసెంబ్లీ ఎన్నికలకు ముందు ఓట్ల కోసం ఎల్ఆర్ఎస్‌ను ఉచితంగా అమలు చేస్తామని హామీ ఇచ్చిన సీఎం రేవంత్ రెడ్డి, ఆ విషయాన్ని విస్మరించారని శేరిలింగంపల్లి ఎమ్మెల్యే ఆరెకపూడి గాంధీ ధ్వజమెత్తారు. అంతేగాకుండా ఎల్ఆర్ఎస్ పేరుతో కోట్ల రూపాయలు వసూలు చేసేందుకు సిద్ధం అయ్యారని ఆరోపించారు. ఆయన ఇచ్చిన హామీ మేరకు ఉచితంగా అమలు చేసి తీరాల్సిందేనని, లేని పక్షంలో ప్రజల తరపున పెద్ద ఎత్తున ప్రభుత్వంపై పోరాడుతామని ఎమ్మెల్యే గాంధీ హెచ్చరించారు. ఎల్ఆర్ఎస్‌ను ఉచితం అమలు చేయాలని కోరుతూ బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ పిలుపు మేరకు.. బల్దియా స్టాండింగ్ కౌన్సిల్ సభ్యుడు, కార్పొరేటర్ ఉప్పలపాటి శ్రీకాంత్, పలువురు కార్పొరేటర్లు రాగం నాగేందర్‌యాదవ్, హమీద్ పటేల్, దొడ్ల వెంకటేశ్‌గౌడ్ మంజులరఘునాథ్‌రెడ్డి, సింధుఆదర్శ్ రెడ్డి, మాజీ కార్పొరేటర్ సాయిబాబ సహా పార్టీ శ్రేణులలతో కలిసి జోనల్‌తో పాటు, తహసీల్దార్ కార్యాలయాల్లో గురువారం వినతిపత్రం సమర్పించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ.. రేవంత్‌రెడ్డి బూటకపు హామీలతో అధికారంలోకి వచ్చి వాటిని అమలు చేయటం లేదన్నారు. 25 లక్షల ప్రజలను దృష్టిలో పెట్టుకుని ఎల్ఆర్ఎస్‌ను ఉచితంగా అమలు చేయాలని గాంధీ డిమాండ్ చేసారు. కొత్తగా దరఖాస్తుల ద్వారా డబ్బులు దండుకోవాలని చూస్తే ఊరుకోబోమని హెచ్చరించారు. రూపాయి వసూలు చేయకుండా ప్రజల భూములను రెగ్యులరైజ్ చేయాలని కోరారు. కార్యక్రమంలో పార్టీ నేతలు, మహిళా నాయకులు, డివిజన్ల అధ్యక్షులు, పార్టీ శ్రేణులు పాల్గొన్నారు.

## ఆస్తిపన్ను వసూళ్లకు 24 రోజులు

- వసూళ్ల వేగం పెంచేందుకు.. ప్రత్యేక అధికారులు
- సర్కిల్‌కు ఒక సూపర్‌వైజరీ ఆఫీసర్ల నియామకం




సిటీబ్యూరో, మార్చి 7(నమస్తే తెలంగాణ): రాబోయే కొద్ది రోజుల్లోనే పార్లమెంట్ ఎన్నికల నోటిఫికేషన్ వెలువడనున్న నేపథ్యంలో జీహెచ్ఎంసీ ఆస్తి పన్ను వసూళ్లపై ప్రత్యేక కార్యాచరణ ప్రణాళికలతో ముందుకు వెళుతున్నది. 2023-24 ఆర్థిక సంవత్సరంలో రూ.2,100 కోట్ల నిర్దేశిత లక్ష్యంలో అసెంబ్లీ ఎన్నికల ప్రభావం పడి ఇప్పటి వరకు కేవలం రూ.1,428 కోట్ల మేర మాత్రమే వసూళ్లను రాబట్టుకున్నది. రూ.672 కోట్ల కలెక్షన్లు పెండింగ్‌లో ఉన్నాయి. ఈ నేపథ్యంలోనే ఆస్తి పన్ను బకాయిలపై 90 శాతం వడ్డీ రాయితీ ఇస్తూ వన్ టైం సెటిల్‌మెంట్ (ఓటీఎస్) స్కీంను అందుబాటులోకి తీసుకొచ్చింది. బకాయి ఉన్న వారంతా తక్షణమే 10 శాతం వడ్డీతో మాత్రమే బకాయిలు క్లియర్ చేసుకునే వెసులుబాటు దొరికింది. దీంతో ఈ నెలాఖరు 31తో ఆర్థిక సంవత్సరం ముగుస్తుండటంతో వచ్చే 24 రోజుల్లో సర్కిళ్ల వారీగా లక్ష్యాలను ఖరారు చేస్తూ శుక్రవారం కమిషనర్ రొనాల్డ్ రాస్ ఉత్తర్వులు జారీ చేశారు. అంతేకాకుండా సర్కిల్‌కు ఒక సూపర్‌వైజరీ ఆఫీసర్లుగా నియమించారు. ఇందులో ఐఏఎస్‌ల నుంచి సీనియర్ అధికారుల వరకు ఉన్నారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వ రంగ సంస్థల బకాయిలపై అదనపు కమిషనర్ (ఫైనాన్స్) జయరాజ్ కెనెడీ పర్యవేక్షించనున్నారు. ఇక ఐఏఎస్‌ల నుంచి ముఖ్య అధికారుల వరకు 31 సర్కిళ్లలో ఒక్కో సర్కిల్‌కు సూపర్‌వైజరీ ఆఫీసర్లుగా బాధ్యతలు అప్పగించారు. సూపర్‌వైజరీ ఆఫీసర్లు రోజూ వారీగా వసూలైన ఓటీఎస్ కలెక్షన్లను పీటీఐఎన్ నంబరు, వచ్చిన కలెక్షన్ల వివరాలను ఎప్పటికప్పుడు సమాచారం అందించనున్నారు. ఆయా సర్కిల్ పరిధిలో టాప్ డిపాల్టర్స్ (బకాయిదారుల) లిస్ట్‌ను తీసుకొని వారికి నోటీసులు జారీ చేయడం, చెక్ బౌన్స్‌లపై ప్రత్యేకంగా దృష్టి సారించనున్నారు. ఈ నెల 31వ తేదీలోగా ఓటీఎస్ వసూళ్లలో వేగం పెంచాలని కమిషనర్ ఆదేశాలు జారీ చేశారు.

## విజేత సూపర్ మార్కెట్ వార్షికోత్సవం

### ఘనంగా ఉమెన్స్ డే వేడుకలు



జూబ్లీహిల్స్, మార్చి 7: విజేత సూపర్ మార్కెట్ 25వ వార్షిక వేడుకలను గురువారం ఘనంగా నిర్వహించారు. వార్షిక వేడుకలతో పాటు అంతర్జాతీయ మహిళా దినోత్సవం పురస్కరించుకుని మేనేజింగ్ డైరెక్టర్ మురకొండ జగన్మోహన్ రావు, కృష్ణవేణిలు సిబ్బందితో కలిసి కేక్ కట్‌చేసి శుభాకాంక్షలు తెలిపారు. సూపర్ మార్కెట్ వ్యాపారంలో 1999లో ఒక బ్రాంచితో ప్రారంభమైన విజేత గత 25 ఏండ్లుగా తెలంగాణ, ఏపీలలో వినియోగదారులకు ఉన్నతమైన, నాణ్యమైన సేవలు అందిస్తున్నదని తెలిపారు. కార్యక్రమంలో ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్ మురకొండ సందీప్ చౌదరి, మార్కెటింగ్ డైరెక్టర్ సిద్ధార్థ, సిబ్బంది పాల్గొన్నారు.







సమావేశంలో మాట్లాడుతున్న తెలంగాణ సీఎం రేవంత్‌రెడ్డి, పట్టాలు అందుకున్న ఆనందంలో ఆర్మీ డెంటల్ కాలేజీ విద్యార్థులు

## వైభవంగా ఆర్మీ డెంటల్ సైన్సెస్ స్నాతకోత్సవం

జవహర్‌నగర్: జవహర్‌నగర్ కార్పొరేషన్‌లోని ఆర్మీ డెంటల్ కళాశాలలో గురువారం స్నాతక వేడుకలు ఘనంగా జరిగాయి. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా సీఎం రేవంత్‌రెడ్డి హాజరయ్యారు. 2020 బ్యాచ్‌లో మాస్టర్ డిగ్రీ చదివిన 15 మంది, 2018లో బ్యాచిలర్ డిగ్రీ చేసిన విద్యార్థులకు పట్టాలను అందజేశారు. ఉత్తమ ఆల్ రౌండర్ విద్యార్థిగా డాక్టర్ శ్రేయా శుక్లా చీఫ్ ఆఫ్ ఆర్మీ స్టాఫ్ రోలింగ్ ట్రోఫీని అందుకోగా, డాక్టర్ హర్సూర్ థిల్లాన్, అనుష్క మీనన్‌కు అవార్డులు, నగదు బహుమతులు అందించారు. కార్యక్రమంలో మంత్రి కోమటి రెడ్డి వెంకట్‌రెడ్డి, మేజర్ జనరల్ రాకేష్ మనోడియా తెలంగాణ, ఆంధ్రప్రదేశ్ సబ్ ఏరియా చైర్మన్, కాలేజీ సిబ్బంది, విద్యార్థులున్నారు.

## పరిశ్రమలు, విద్యా సంస్థలకు మధ్య అంతరం తగ్గాలి

### సీఐడీ అడిషనల్ డీజీ మహేశ్ భగవత్



జేఎన్టీయూహెచ్‌లో జరిగిన సదస్సులో పబ్లిక్, కార్పొరేట్ అడ్మినిస్ట్రేటర్లను సత్కరిస్తున్న అడిషనల్ డీజీ మహేశ్ భగవత్, వీసీ కట్టా నర్సింహారెడ్డి

కేపీహెచ్‌బీ కాలనీ, మార్చి 7: పరిశ్రమలు.. విద్యాసంస్థలకు మధ్య అంతరాన్ని తగ్గించేందుకు నిపుణులు మరింత కృషి చేయాలని సీఐడీ అడిషనల్ డీజీ మహేశ్ భగవత్ అన్నారు. జేఎన్‌టీయూహెచ్‌లో ఇంటర్నేషనల్ నాలెడ్జ్ అండ్ అపార్చునిటీ నెట్‌వర్క్ హైదరాబాద్ ఆధ్వర్యంలో నెట్‌వర్కింగ్ సహకారం, స్కిల్ డెవలప్‌మెంట్, యువత కోసం ఉపాధి కల్పన లక్షణాలతో రికగ్నైజ్, రి కనెక్ట్, రి ఇన్వెంట్ (ఆర్ ఆర్) అనే థీమ్‌తో మల్టీనేషనల్ కంపెనీల హెచ్ ఆర్, సీఈవోలతో హెచ్‌ఆర్ కాంక్లేవ్‌ను నిర్వహించారు. ముఖ్యఅతిథులుగా అడిషనల్ డీజీ మహేశ్ భగవత్, వర్సిటీ వైస్‌చాన్స్‌లర్ కట్టా నర్సింహారెడ్డి, రెక్టార్ విజయ్‌కుమార్‌రెడ్డి, రిజిస్ట్రార్ వెంకటేశ్వర్‌రావు, పూర్వ విద్యార్థుల వ్యవహారాల డైరెక్టర్ సురేశ్‌కుమార్, యూఐఐసీ డైరెక్టర్ రజని, స్ప్రిపుల్ సీఈవో బూర వెంకట్, స్ప్రెడియన్ టెక్నాలజీస్ హెచ్‌ఆర్ హెడ్ రెమెళ్ల శ్రీధర్, అరవింద్, కరుణ వెంపల, రాజేశ్ దుడ్డు, సంజీత్‌శర్మ హాజరయ్యారు. విద్యార్థులకు మెరుగైన ప్లేస్‌మెంట్ కోసం పరిశ్రమలకు, విద్యా సంస్థలకు అంతరాలను తగ్గించడం, నైపుణ్యం, వైవిధ్యం, ఈక్విటీ, కలుపుగోలుతనం, ఐటీలో తాజా అవాంతరాలు, ఏఐ, చాట్ జీపీటీల పాత్ర అంశాలపై చర్చించారు. అనంతరం 100 మంది పబ్లిక్, కార్పొరేట్ అడ్మినిస్ట్రేటర్లకు అవార్డులతో సత్కరించారు. కార్యక్రమంలో 300 మంది సీఎక్స్‌వోలు, హెచ్‌ఆర్‌లు, విద్యావేత్తలు, పలు కళాశాలలకు చెందిన ప్లేస్‌మెంట్ ఆఫీసర్లు పాల్గొన్నారు.

## కోల్హు నుంచి తీసిన నూనెలో క్యాన్సర్ నిరోధకాలెన్నో..

### ఆవాల నూనెపై పతంజలి మార్గదర్శక పరిశోధన



జూబ్లీహిల్స్, మార్చి 7: కోల్హు నుంచి తీసిన ఆవాల నూనెలో క్యాన్సర్ నిరోధక సమ్మేళనం ఉంటుందని 'ఫుడ్ కెమిస్ట్రీ' ప్రసిద్ధ పరిశోధన పత్రికలో ప్రచురించబడినట్లు పతంజలి వెల్లడించింది. సంప్రదాయ లోడియన్ 'కొల్హు' పద్ధతులను ఉపయోగించి సేకరించిన ఆవాల నూనెపై పతంజలి మార్గదర్శక పరిశోధనను నిర్వహించినట్లు, ఇది భారతీయ సంప్రదాయాల అభ్యాసాలను అభివ్యక్తిని సూచిస్తున్నదని యోగృషి స్వామి రాందేవ్ జీ పేర్కొన్నారు. 'ఫుడ్ కెమిస్ట్రీ'లో ప్రచురించబడిన ఈ ఉత్తేజభరితమైన పరిశోధన, చెక్కతో కూడిన కొలువు ఉపయోగించి చమురు వెలికితీత యొక్క శతాబ్దాల నాటి అభ్యాసానికి మద్దతునిస్తున్నదని, పర్యావరణ పరిరక్షణకు, కుటీర పరిశ్రమల ద్వారా విరివిగా జీవనోపాధిని సృష్టించడానికి దోహదపడుతున్నదని ప్రకటనలో పేర్కొన్నారు.

## కాంటినెంటల్ హాస్పిటల్‌లో ఉమెన్స్ డే



జూబ్లీహిల్స్, మార్చి 7: కాంటినెంటల్ హాస్పిటల్‌లో రియల్ డైమండ్స్ ఆఫ్ హైదరాబాద్ ఉమెన్స్ డే మాసోత్సవాలు నిర్వహిస్తున్నారు. వేడుకల్లో భాగంగా గురువారం అంతర్జాతీయ మహిళా దినోత్సవం ఘనంగా నిర్వహించారు. 27 మంది బిజినెస్ ఉమెన్స్‌తో మహిళా శక్తి బజార్ ప్రదర్శనతో పాటు అత్యుత్తమ సేవలందించిన మహిళా ఉద్యోగులు, డాక్టర్లను అవార్డులతో సత్కరించారు. కార్యక్రమంలో వీహబ్ సీఈఓ దీప్తి రావుల, ఇండియన్ స్కూల్ ఆఫ్ బిజినెస్ డైరెక్టర్ సుతాప పొద్దార్‌రాయ్, బీజేపీ నేషనల్ పాలసీ ఇన్‌చార్జి కరుణగోపాల్, కాంటినెంటల్ హాస్పిటల్ ఫౌండర్ అండ్ చైర్మన్ గురు ఎన్.రెడ్డి పాల్గొన్నారు.

## అన్ని విభాగాల్లో స్త్రీలదే పై చేయి

### ఉమెన్స్ డే వేడుకల్లో జల మండలి ఎండీ సుదర్శన్ రెడ్డి



సిటీబ్యూరో, మార్చి 7(నమస్తే తెలంగాణ): నేటి సమాజంలో అన్ని విభాగాల్లోనూ స్త్రీలదే పై చేయిగా ఉన్నదని, ఏ చరిత్ర తీసుకున్నా, స్త్రీలకు ప్రత్యేక స్థానం కల్పిస్తున్నదని జల మండలి ఎండీ సుదర్శన్ రెడ్డి అన్నారు. జల మండలి ఉమెన్స్ వెల్ఫేర్ అసోసియేషన్ ఆధ్వర్యంలో ఖైరతాబాద్ సంస్థ ప్రధాన కార్యాలయంలో అంతర్జాతీయ మహిళా దినోత్సవంలో ఎండీ పాల్గొన్నారు. ఫిన్లాండ్ లాంటి దేశాల్లో చట్ట సభల్లో అత్యధిక శాతం మహిళలే ఉన్నారని, మహిళల కోసం అనేక చట్టాలున్నాయని, కాని, వాటిని అమలు చేయడంలో విఫలమవుతున్నారని ఆయన అన్నారు. వ్యక్తిగత, ఉద్యోగ ప్రయాణంలో వచ్చే అడ్డంకులన్నీ తొలగించుకుంటూ సొంత బలంతో విజయపథంలో దూసుకెళ్లాలని రాఖీ కంకారియా అన్నారు. ఈ సందర్భంగా వివిధ పోటీల్లో గెలిచిన ఉద్యోగులకు బహుమతులను ప్రదానం చేశారు. కార్యక్రమంలో ప్రాజెక్టు డైరెక్టర్ శ్రీధర్‌బాబు, రెవెన్యూ డైరెక్టర్ వీఎల్ ప్రవీణ్ కుమార్, జల మండలి ఉమెన్స్ వెల్ఫేర్ అసోసియేషన్ ఏజే సుగంధిని, జనరల్ సెక్రటరీ బిల్కిస్ భాను, వాటర్ వర్క్స్ ఎంప్లాయీస్ యూనియన్ అసోసియేషన్ అధ్యక్షుడు రాంబాబు యాదవ్ పాల్గొన్నారు.

## బహుళ జీవ వైవిధ్యానికి భారత్ వేదిక

సిటీబ్యూరో: బహుళ జీవ వైవిధ్యానికి భారత్ వేదికగా నిలుస్తున్నదని పలువురు నిపుణులు వ్యాఖ్యానించారు. గురువారం ఇండియన్ ఇనిస్టిట్యూట్ ఆఫ్ కెమికల్ టెక్నాలజీలో జరిగిన అంతర్జాతీయ సదస్సులో పలువురు రసాయనిక రంగ నిపుణులు పాల్గొని ప్రసంగించారు. ఐఐసీటీ డైరెక్టర్ డా.శ్రీనివాస్ రెడ్డి అధ్యక్షతన జరిగిన ఈ సదస్సులో హెచ్‌సీయూ ప్రొఫెసర్. గోవర్ధన్ మెహతా తదితరులు పాల్గొన్నారు.

## చెరువులు కబ్జాకు గురికాకుండా చూడాలి

రంగారెడ్డి, మార్చి 7(నమస్తే తెలంగాణ) : చెరువులు, ప్రభుత్వ భూములు కబ్జాకు గురికాకుండా చూడాలని జిల్లా కలెక్టర్ శశాంక్ అధికారులకు సూచించారు. గురువారం రంగారెడ్డి జిల్లా కలెక్టరేట్‌లో కందుకూరు డివిజన్ పరిధిలోని చెరువులు, ప్రభుత్వ భూములపై వివిధ శాఖల అధికారులతో సమీక్షా సమావేశం నిర్వహించారు. సమావేశంలో జిల్లా అదనపు కలెక్టర్ ప్రతిమ సింగ్ తదితరులు పాల్గొన్నారు.

## 61 నర్సరీల్లో.. 63 లక్షల మొక్కలు

- 10వ విడత హరితహారానికి మొక్కలు సిద్ధం
- మొక్కల కొరత రాకుండా అధికారుల ప్రణాళికలు

మేడ్చల్, మార్చి 7 (నమస్తే తెలంగాణ): మేడ్చల్-మల్కాజిగిరి జిల్లాలోని 61 నర్సరీల్లో 63 లక్షల మొక్కలను గ్రామీణభివృద్ధి సంస్థ ఆధ్వర్యంలో పెంచుతున్నారు. 10వ విడత హరితహారానికి అధికారులు మొక్కలు సిద్ధం చేస్తున్నారు. జిల్లాలోని 61 గ్రామ పంచాయతీలతో పాటు 13 మున్సిపాలిటీల పరిధిలో మొక్కలను నాటనున్నారు. జిల్లాలోని జీహెచ్ఎంసీ పరిధిలో అవసరమైన మొక్కలను నాటేందుకు అటవీశాఖ, జీహెచ్ఎంసీ మొక్కలను సరఫరా చేయనుంది. మొక్కల కొరత రావొద్దని గత ఏడాదే లక్ష్యాన్ని ఎంచుకున్నారు. 63 లక్షల మొక్కలు నాటేలా కలెక్టర్ గౌతమ్ వివిధ విభాగాల జిల్లాస్థాయి అధికారులకు ఆదేశాలు జారీ చేసిన విషయం విధితమే.

### ఔషధ మొక్కలకు ప్రాధాన్యం...

రానున్న హరితహారంలో ఔషధ మొక్కలకు ప్రాధాన్యతను ఇవ్వనున్నారు. రహదారులకు ఇరువైపులా భారీ వృక్షాలకు సంబంధించి మొక్కలతో పాటు ఇంట్లో పెంచుకునేందుకు జామ, నిమ్మ, తులసి, వేప, పూల మొక్కలను ప్రజలకు అందించనున్నారు. గ్రామ పంచాయతీకి 50 మందికి చొప్పున ఉపాధి హామీ కూలీలచే హరితహారంలో మొక్కలు నాటేందుకు గుంతలు తీసేలా గ్రామీణాభివృద్ధిశాఖ ప్రణాళికను సిద్ధం చేసింది. ఇప్పటికే ఎంపీడీవోలతో సమావేశం నిర్వహించి మొక్కలు నాటే ప్రాంతాలను గుర్తించాలని జిల్లా అధికారులు సూచించారు. ఎండిపోయిన మొక్కల స్థానంలో కొత్త మొక్కలను నాటనున్నారు.

## 9న మలబార్ ఆధ్వర్యంలో స్కాలర్‌షిప్ వేడుకలు

జూబ్లీహిల్స్, మార్చి 7: మలబార్ చారిటబుల్ ట్రస్ట్, దయా పునరావాస ట్రస్ట్‌తో కలిసి తెలంగాణలో 'అమ్మమ్మ ఇల్లు', 'ఆకలి లేని ప్రపంచం', స్కాలర్‌షిప్‌ల ప్రారంభ వేడుకలను నిర్వహిస్తున్నారు. వీటిని నగరంలోని చందానగర్ పీజేఆర్ స్పోర్ట్స్ స్టేడియం దగ్గర అపర్ణ హిల్ పార్క్ రోడ్ కేఎస్సార్ ఎన్‌క్లేవ్‌లోని 'అమ్మమ్మ ఇల్లు' వేదికగా నిర్వహిస్తున్నట్లు నిర్వాహకులు తెలిపారు. ఈ నెల 9న ఈ కార్యక్రమాన్ని పంచాయతీ రాజ్, గ్రామీణాభివృద్ధి, మహిళా శిశు సంక్షేమ శాఖ మంత్రి దనసరి అనసూయ సీతక్క ప్రారంభించనున్నట్లు తెలిపారు. గోల్డ్ అండ్ డైమండ్స్ తెలంగాణ, ఏపీలలో ఆభరణాల వ్యాపార రంగంలో విశ్వసనీయమైన సేవలందిస్తున్న మలబార్ గోల్డ్ కార్పొరేటర్ సోషల్ రెస్పాన్సిబిలిటీ కార్యక్రమంలో భాగంగా ఈ సామాజిక సేవా కార్యక్రమాలు చేపడుతున్నట్లు తెలిపారు.

## ముగింపులేని కథలు పుస్తకావిష్కరణ



ముగింపులేని కథలు పుస్తకాన్ని ఆవిష్కరిస్తున్న వక్తలు

రవీంద్రభారతి, మార్చి7: తెలంగాణ భాషా సాంస్కృతిక శాఖ సౌజన్యంతో శ్రీకళానికేతన్, హైదరాబాద్ సమర్పణలో గురువారం రవీంద్రభారతిలోని సమావేశ మందిరంలో రచయిత నెమలికంటి తారక రామారావు రచించిన ముగింపులేని కథలు పుస్తకావిష్కరణ, అంకితోత్సవం జరిగింది. ఇందుకు ముఖ్య అతిథిగా పద్మశ్రీ ఆచార్య కొలకలూరి ఇనాక్ విచ్చేసి జ్యోతి ప్రజ్వలనం చేసి లయన్ శ్రీసాధు శ్యాంప్రసాద్, సీతా కుమారి సాధులకు 'ముగింపులేని కథలు' పుస్తకాన్ని అందజేశారు. సభాధ్యక్షుడిగా సాహితీవేత్త ఓలేటి పార్వతీశం, ఎంఎన్ జగన్నాథ శర్మ, ఆచార్య రామవరపు గణేశ్వరరావు, లయన్ కట్టంగూరు హరీష్‌రెడ్డి, జొన్న సాంబ శివరావు, కేవీ రమణారావు, ఏవీఎన్ ప్రభాకర్, పీవీ ఆర్‌కే ప్రసాద్ పాల్గొన్నారు.

## ఫార్మ్ డీ పరీక్షా ఫలితాల విడుదల

ఉస్మానియా యూనివర్సిటీ, మార్చి 7: ఉస్మానియా యూనివర్సిటీ పరిధిలోని ఫార్మ్ డీ కోర్సుల పరీక్షా ఫలితాలను విడుదల చేసినట్లు ఓయూ పరీక్షల విభాగం, కంట్రోలర్ ప్రొఫెసర్ రాములు తెలిపారు. మూడేళ్ల ఫార్మ్ డీ, ఆరేళ్ల ఫార్మ్ డీ కోర్సుల రెగ్యులర్ పరీక్షా ఫలితాలను విడుదల చేసినట్లు చెప్పారు. ఈ ఫలితాలను ఓయూ వెబ్‌సైట్ www.osmania.ac.inలో అందుబాటులో ఉంచినట్లు ఆయన పేర్కొన్నారు.

## తండ్రి మరణాన్ని తట్టుకోలేక..

మన్సూరాబాద్, మార్చి 7: తండ్రి మరణాన్ని తట్టుకోలేక మనస్తాపంతో ఓ యువతి ఆత్మహత్యకు పాల్పడింది. ఈ ఘటన ఎల్బీనగర్ పోలీస్‌స్టేషన్ పరిధిలో గురువారం చోటు చేసుకుంది. పోలీసుల కథనం ప్రకారం, మన్సూరాబాద్, సాయి సప్తగిరి కాలనీకి చెందిన బాసరి సునీతకు కుమారుడు, కుమార్తె బాసరి కీర్తన(20) ఉన్నారు. సునీత భర్త శ్రీనివాస్ మూడు నెలల క్రితం చని పోయాడు. శ్రీనివాస్ మృతితో ఆయన కూతురు కీర్తన తీవ్ర దిగ్భ్రాంతికి గురై కృంగిపోయింది. తరచు తండ్రిని గుర్తు చేసుకునేది. తండ్రి లేని జీవితం వృథాగా భావించింది. గురువారం ఉదయం 8:30 గంటలకు కీర్తన తల్లి సునీత పని నిమిత్తం బయటకు వెళ్లింది. కీర్తన ఒంటరిగా ఇంట్లో ఉంది. సునీత మధ్యాహ్నం 3 గంటలకు ఇంటికి వచ్చి డోర్ కొట్టగా కీర్తన తీయలేదు. బలవంతంగా డోర్ ఓపెన్ చేసి చూడగా సీలింగ్‌కు చున్నీతో ఉరి వేసుకుని యువతి మృతి చెందింది. తండ్రి మృతిని తట్టుకోలేక తన కూతురు మృతి చెందిందని తల్లి సునీత ఇచ్చిన ఫిర్యాదు మేరకు ఎల్బీనగర్ పోలీసులు కేసు నమోదు చేసుకున్నారు. మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం ఉస్మానియా దవాఖానకు తరలించారు.

